# వ్యత్యాసాలు

మొదటినుంచీ అదోరక తరహా మనిషి సీత, నలుగురితోటీ కలిసితిరగడం అన్నా, పదిమందిలోనూ ఝణాయించి మాట్లాడ్డం అన్నా ఎక్కడలేని సిగ్గూ, భయమూను. అలాగని ఆ పద్ధతులు ఇష్టం లేవా అంటే, స్నేహితుల మధ్య చురుగ్గా కళ్ళు తిప్పుతూ, ఝుంకారంగా మాట్లాడుతూ కాలేజీ అంతా చక్రకాయిలాగ అలంగంతిరిగే లీలంటే వల్లమాలిన అభిమానం, చెప్పలేనంత ప్రేమాను, ఇంకా చెప్పాలంటే "చూడండి మా లీల ఎంత తెలివయిందో" అనే ఓ చిన్న గర్వరేఖ కూడాను. మనసులో-చలాకీగా సిసీంద్రిలా వుండడం ఇష్టమే సీతకి. అలా ఉన్నవాళ్ళనిచూస్తే ముచ్చట కూడాను. అయితే, ఏమిటో తనే అలా వుండలేదు. నోరు విప్పి మాట్లాడబోతే కంఠం వణుకుతుంది. పైవాళ్ళెవరైనా పలకరిస్తే వళ్ళంతా ముచ్చెమటలు పడతాయి. ఇందుకు తగ్గట్టే అలవాట్లూ అభిరుచులూను. రోజుకోరకంగా మారి

పోతున్న వెఱ్ఱి వెఱ్ఱి ఫేషన్ల మీద మోజు ఏమీ వుండదు సీతకి. చక్కగా జడవేసుకొని కాటుకా, బొట్టూ పెట్టుకొని పెద్ద పైట వంటినిండా కప్పుకొని, వినయ విధేయతలు ఉట్టి పడేటట్లు ఎంతో సంబాళింపుగా వుండటం అలవాటు. అమ్మ ఏం కష్టపడుతుందో, నాన్నగారికి ఏం కోపం వస్తుందో అన్న ధ్యాసే సీతకి, పొద్దు అస్తమానం. అందుకే అమ్మ చేతికి ఆసరా అవుతూ, నాన్నగారికి అవసరం అన్నప్పుడల్లా ఆఫీసు కాగితాలు రాసిపెడుతూ, చూచే వాళ్ళందరికీ బంగారు తల్లిలా, ముచ్చటగొలిపేలా, పుట్టింటిలో మసిలింది, పెళ్ళయి అత్తవారింటకి వెళ్ళేదాకా.

అసలు సీతలోవున్న ఈ నెమ్మదితనమే ఆకర్షించింది పెళ్ళిచూపుల్లో అత్తగారినీ, మామగారినీను. అడిగిన ప్రశ్న లకి, తల వంచుకుని వినయంగా సమాధానం చెప్తున్న సీతని చూసి "ఈ రోజుల్లో ఇంత కుదురైన అమ్మాయిలు ఏరీ?" అంటూ తెగ సంబరపడిపోయి, జగన్నాథం గారిచ్చిన ఆ నాలుగువేల రూపాయలూ పలభై వేలుగా భావించి తమ ఇంటి కోడల్ని చేసుకున్నారు. లక్ష్మిలాంటి కోడలు దొరికిం దని తెగసంబరపడి పోయారుకూడా. కాని, మధు మాత్రం అలా ఆనందించలేదు. అతని కళ్ళకి లక్ష్మిలా కనిపించలేదు. పెళ్ళిలో తలంబ్రాలు పోయాడానికి కూడా సిగ్గుపడిపోయి కుంచించుకుపోయిన సీత - కేవలం పద్ధెనిమిదవ శతాబ్దానికి చెందిన ఒక అందమైన బొమ్మలా మాత్రం కనిపించింది! అయితే నెమ్మది అయిన స్వభావంకల పిల్లకనక క్రమేపీ తన అభిరుచులకి అనుగుణంగా మార్చుకోవచ్చుకదా అని ఆశిం

చాడు. తను ఉద్యోగం చేసే ఊరికి తీసుకువెళ్ళిపోయాక తన పద్ధతులు అన్నీ చెప్పి ఎంతలో మారుస్తాం, ఈ పూర్వ కాలపు అలవాట్లని అనుకున్నాడు.

క్వార్టర్సులో చేరిన మార్నాడు వీధిగడపకి పసుపు రాస్తూ కనిపించి అతని అంచనాలన్నీ తారుమారు చేసేసింది సీత. స్కూటర్ మీద తన వెనకాల కూచుని సాగర్ దగ్గరికి షైరు రావడానికి సిగ్గుపడిపోయిన సీతని చూసేసరికి ఎక్కడ లేని చిరాకూ వేసింది మధుకి.

ఇంటికి తన ఫ్రెండ్సు వస్తే కాఫీ, కర్టెన్ వెనకాల నుంచి అందిస్తుందేకాని కలసిమెలసి కూర్చొని కబుర్లు చెప్పదు కదా-అని కొన్నాళ్లు విసుక్కున్నాడు మధు. "నువ్వా పల్లెటూరి జగన్నాథం కూతురివికావు - అసిస్టెంటు ఇంజనీర్ మధుసూధనరావు భార్యవి, తెల్సా?" అంటూ హెచ్చరించి చూశాడు రెండుమూడుమాట్లు. 'కొత్త విషయం చెప్పారే' అన్నట్లుగా మధురంగా నవ్వి పూరుకుందేకాని, మార్పు మాత్రం ఏం తీసుకురాలేదు సీత, తన ప్రవర్తనలో. తక్కిన వన్నీ బాగానే ఉంటున్నాయి. ఒక్క ఆ పాత పద్ధతులే నచ్చటంలేదు మధుకి. ఇంట్లో ఎలా వున్నా సరే బైట ప్రపంచానికి మాత్రం ఫేషనబుల్‌గా కనిపించాలి. అంతా తన భార్య నవనాగరికురాలు అనుకోవాలి అనే కోరిక మధుకి. ఎంత ప్రయత్నించినా అలా ఉండడం తనవల్ల కావడంలేదు సీతకి. తన అశక్తతమీద కోపం, భర్త మనస్సు గాయపడుతోందే

అనే బాధ-ఏమిటి చేయడం? ఎలాగ దీని పరిష్కారం? సీత తెగ సతమతం అయిపోతోంది. ఇది తప్ప తనకీ ఆయనకీ మధ్య ఏ పొరపొచ్చాలూ లేవు - ఇది ఒకటే తన ఆనంద మయ జీవితంమీద అప్పుడప్పుడూ నీలినీడలా పడుతోంది. ఈ నీడని తప్పించుకోలేనా? జీవితంలో ఈ ఒక్క అసంతృప్తినీ ఆయనకు లేకుండా చేయలేనా?

ఇలా ఇలోచిస్తూన్న సీతకి, మధు కంఠంలోని తీవ్రత విని, ఉలిక్కిపడి అటు చూసింది. "ఏం, వినిపించడం లేదూ, ఇందాకటినుంచి అడుగుతుంటే? వస్తాను-రాను-అని ఏ మాటా చెప్పవేమిటి" అన్నాడు మళ్ళీ. వెంటనే తొట్రుపడుతూ "ఎక్కడికీ, యెక్కడికి రావటం?" అంది సీత. "అయితే ఇందాకటినుంచీ నువ్వేం వినలేదన్నమాట? అంత లక్ష్యంగావుంది మాటంటే...సరే... రానక్కరలేదులే, నేను వెళుతున్నాను. అసలు ఒకప్పుడుంటేగా నాతో కలసి సరదాగా రావడం అదీను...ఊ..." దీర్ఘంగా నిట్టూర్చి స్కూటర్ దగ్గరికి నడిచాడు మధు.

నైలాన్ సాక్సూ, బూటూ, టెర్లిన్ సూటులో మెరిసిపోతూ కనిపించాడు మధు సీత కళ్ళకి. పచ్చని ముఖంమీద నల్లని గెడ్డం ఆనమాలూ, కళ్ళజోడు వెనకాల తళుక్కుమనే తెలివైన కళ్ళూ, బిరుసైన క్రాఫూ - ఎంత అందంగా వున్నారు-అనుకుంది సీత.

ఈయన వెనకాల స్కూటర్ మీద కూచుని ఓ చెయ్యి అలా అలవోకగా ఆయన భుజంమీదవేసి రివ్వున

పోతూన్న స్కూటర్ గాలికి తను కట్టుకున్న చీర తప తప లాడుతూ చప్పుడు చేస్తూంటే- అబ్బ! అనుభూతి తలుచుకుం టేనే ఎంతో హాయిగా వుంది...కాని...కాని...అలా వెళ్ళటం అంటే ఏమిటో తనకు సిగ్గుబాబూ! "ఏం రావన్న మాటే కదూ!" ఆఖరిసారిగా అడిగి చూశాడు మధు స్కూటర్ స్టేండు తీస్తూ. సిగ్గుతో బరువెక్కిపోయిన కను రెప్పలనెత్తి అతనికేసి క్రీగంట చూసి వెంటనే తల దించేసు కుంది సీత. చూపులు వచ్చి తిన్నగా గుండెలకు తగలడంతో మళ్ళీ స్టేండువేసి, నవ్వుతూ దగ్గరికివచ్చి సీత రెండు బుజాలు పట్టుకుని "ఎందుకిలా నాతో రావడానికి సిగ్గుపడతావు? నీ వయస్సువాళ్లు చూడు-ఎంత చలాకీగా వుంటారో? ఎవరో ఎందుకు, నీ ఫ్రెండ్ లీల ఎలా ఉంటుంది? మన పెళ్ళిలో ఆమె చురుకుతనం చూచిన నా ఫ్రెండ్సు అందరూ ఇప్పటికీ అడుగుతూ ఉంటారు. 'ఆ...అమ్మాయికి పెళ్ళయిందిరా!' అని. ఆవిడ ఫ్రెండ్‌వే నువ్వు మళ్ళీ, కాని ఇద్దరిలోనూ ఎంత తేడావుంది?" అన్నాడు.

"అన్నట్లు చెప్పడం మరచిపోయాను మాబాగా జ్ఞాపకం చేశారు. మా లీల వస్తూన్నట్లు ఉత్తరం రాసింది. ఈ సాయంత్రమే!"

"ఐసీ...అలా చెప్పు నీ ఫ్రెండుని, రిసీవుచేసుకోవడం కోసం నువ్వు పార్టీకి రాకుండా ఆగిపోతున్నా వన్నమాట! మరి ఇందాకటినుంచీ ఆ మాట చెప్పవే?...సరి...సరి. నీ ఫ్రెండు వస్తూన్న సందర్భంలో మాకు పిండి వంటలేమిటి?

వచ్చేటప్పుడు ఇట్లో కేమున్నా తీసుకు రావాలా? "హుషా రుగా గబ గబా సీత బుజాలు రెండూ కుదువుతూ అడిగే శాడు మధు.

సీత నవ్వుతూ "తమరేం తేనక్కరలేదు కాని పార్టీ నుంచి పెందరాళే తెమిలి రండి. అదేచాలు" అంది.

స్కూటర్ మీాద రివ్వుమంటూ వెళ్ళిపోయిన మధుని చూస్తూ మధుర స్మృతులేవో నెమరు వేసుకుంటూ గుమ్మం లోనే ఆ మటునే నిలబడిపోయిన సీత ఉలిక్కిపడి చూసింది దగ్గర్లో అడుగుల చప్పుడు విని. "ఏమిటే గుమ్మంలో కలలు గంటూ నుంచున్నావ్! నేను రాసిన ఉత్తరం అందలేదే మిటి? కనీసం మీా ఆయన్నైనా బస్స్టాండ్ కి పంపించలేదు" అంటూ ఎయిర్ బేగ్ పట్టుకుని మెట్లు యెక్కుతోంది లీల.

"ఓ...లీలా..." అంటూ సంతోషంతో ఒక్క కేక వేసి ఛెంగున ఎగిరి ఎదురువెళ్ళి అమాంతం లీలని కౌగలించు కొంది సీత. సీత చుట్టూ చేతులేసి "ఇదేమిటే యింతలావు ఎక్కిపోయావ్, ఈ ఆరు నెల్లోనూ,సందెట ఇమడకుండాను? హా...హతవిధీ! మీా ఆయన ఏం అవస్త పడుతున్నాడో ఏమోను-నీతో పాపం."

అంటూ సానుభూతి సూచకంగా నాలుకను పై అంగు టితో తాటిస్తూ చప్పుడు చేసింది లీల. "చప్ నోరుముయ్యి" అంది సీత తెచ్చిపెట్టుకున్న కోపంతో.

"అబ్బో...అబ్బో ఆర్నెల్లు కాపురం చేశాక కూడా యింకా అమ్మాయిగారి కళ్ళల్లోనూ, బుగ్గల్లోనూ గులాబులు

పూస్తున్నావే!" అంది ముఖంమీద ముఖంపెట్టి నవ్వుతూ లీల.

సీతకి కూడా నవ్వు వచ్చేసింది. లీలదగ్గర ఎయిర్ బేగ్ తీసుకుని బుజంమీద చెయ్యివేసి లోపలికి నడిపించి తీసుకువెళుతూ "నీ అల్లరీ, అకతాయితనం అలాగేవున్నాయి సుమా! పెళ్ళి అయ్యాకకూడా" అంది సీత. ఆ మాటలు వినీ కూడా వినసట్లు హాలులో ఉన్న కేలండర్లూ, ఫోటోలు చూడసాగింది లీల.

"ఏమే అడిగినదానికి జవాబు చెప్పక, వినవట్లు పోజు పెడతావు? నీ చిలిపితనాన్ని - చివాట్లు పెట్టకుండా భరిస్తున్నాడా మీ ఆయన?" అంది లీలని సోఫాదగ్గరికి తీసుకు వెళుతూ. సీత ముఖంలోకి సీరియస్‌గా చూసి, "ఏం మీ ఆయన భరించటంలేదూ - హాలులో ఈ దేవుళ్ళ ఫోటోలు, దేవతల ఫోటోలు అన్నీ, నువ్వు పెడుతుంటే సంతోషించాం. కానీ హాలులో ఆ రాముడూ, కృష్ణుడూ ఫోటోలు తీసేసి ఇంచక్కా మంచి సీనరీసు ఫొటోలూ, మధ్యన ఎన్‌లార్జు చేసిన మీ దంపతుల ఫోటో పెట్టు" అంది లీల సోఫామీద కూచుంటూ.

"ఆయనా అలాగే అంటారే! కాని...కాని..."

"కాని లేదు ఏగాణీ లేదు...ఆ, ఇంతకీ మా బావగారేరీ? మరదలు వస్తోందని తెలిసి భయపడి పారిపోయారేమిటి!"

"స్నేహితుల ఇంట్లో పార్టీ అంటేను వెళ్ళారు, ఓ అర

గంటలో వచ్చేస్తారు. నువ్వీలోగా లేచి స్నానం చెయ్యి, బడలికగా వుందేమో! నేను కాఫీ తయారుచేస్తా" నంది సీత.

"కాఫీ తాగితేగాని స్నానంచేసే ఓపిక కూడా లేదు. వెంటనే కాఫీ కావాలి" అంది లీల.

సీత నవ్వుకుంటూ లేచింది. 'ఇదేం మారలేదు' అనుకుంటూ వంటఇంటివేపు వెళ్ళింది లీల - ఆమెను అనుసరించింది, వంటింటివేపు. కాఫీ తాగుతున్నంతసేపూ, స్నానం చేస్తూన్నంతసేపూ, చివరికి బట్టలు వేసుకుంటూను ఏవో ప్రశ్నలు వేస్తూనే వుంది. కొన్నింటికి సీత సమాధానాలు ఇస్తోంది, కొన్నింటికి సిగ్గుపడి చెప్పలేక ఊరుకుంటూంది.

చివరికి అడిగేసింది: "అంతెందుకు? ఒక్క విషయం చెప్పమా, దాన్నిబట్టి తక్కినదంతా నేనే ఊహించుకుంటాను. నీ బెడ్ రూమ్ నువ్వు ఊహించినంత స్వీటుగా ఉందా?" అని. బుగ్గలు ఎర్రమందారాలులా మారి పెదవి వణికిపోతుండగా కళ్ళు పెద్దవిచేసి, "నోర్ముయ్! అలాంటి ప్రశ్నలువేశావంటే చెంపలు వాయగొట్టేస్తాను" అంది సీత కోపంతో.

"రైటు. అంతా తెలిసిపోయిందిలే, వండర్‌ఫుల్ వండర్‌ఫుల్" అంటూ చప్పట్లుకొట్టింది లీల. అప్పటికప్పుడే, స్కూటర్ వరండాలో స్టేండువేసి హాల్లోకి వస్తూన్న మధు, కోపంతో సీత పెడుతున్న కేకలు, సంతోషంతో లీల కొడుతూన్న చప్పట్లు - హాలు అంతా హడావిడిగా ఉండటం చూసి, కంగారుగా హాల్లోకి వచ్చాడేకాని - లీలని చూసి కొత్త మనిషిని చూసినట్లు చటుక్కున ఆగిపోయాడు. సీత తనని

పరిచయం చేసేలోగానే తనే పలకరించేసింది లీల - "అదే మిటి బావగారూ! అలా చూస్తారు? మరచిపోయారేమిటి? నేను లీలని. నా పెళ్ళికి మీ రిద్దరూ ఎందుకు రాలేదో సంజా యిషీ అడగాలనీ అసలు నే నిప్పుడు వచ్చిన కారణం" అంది లీల. మధు నవ్వి ఊరుకున్నాడే కాని, సమాధానం చెప్ప లేదు. దగ్గరలో వున్న కుర్చీలాక్కొని కూర్చుంటూ—

"నువ్వు రిజిష్టర్ మేరేజ్ చేసుకున్నావు! తీరా రావా లనుకున్నా, నాకో భయం వేసింది. రిజిష్టర్ మేరేజికి గ్రీటింగ్స్ పంపాలే కాని... మీరు ఇంత శ్రమపడి రావటం ఎందుకు?- అని ముఖం మీద అనేసేరకం నువ్వు. పైగా మీరు హనీమూన్ ట్రిప్‌కు వెళ్ళేరోజు ఆ రోజేకదా, అంది. సీత"

"తప్పు తనమీద లేకుండా ఎంత నేర్పుగా చెబుతుందో మా సీత. మీతో కాపురం ఇలాగే చేస్తోందా" అంది లీల మధుకేసి చూస్తూ.

"మా తమ్ముడుగార్ని కూడా తీసుకురాకపోయారా నలుగురం సరదాగా రెండు రోజులు గడుపుదుము" అన్నాడు మధు.

ఆ మాటకు తనూ సమాధానం చెప్పకుండా "ఇదేమి టండీ సన్నగా బంగారు తీగలాగవుండే మా సీత ఇలా లావుగా తయారు అవుతూంటే చూస్తూ ఊరుకున్నా రేమిటి బావగారు!" అంది కొంటెతనముగా సీతకేసి చూస్తూన్న లీల. వస్తూన్న నవ్వును ఆపుకుంటూనే "చెప్పినట్లు వినకపోవడంవల్ల అలా

తయారౌతుంది ఏమంటావ్ సీతా!" అన్నాడు మధు. "మాట్లాడవేం" అంటూ లీల హెచ్చరించింది. సీతకి వళ్లు మండుకొచ్చింది. "సిగ్గులేకపోతేసరి! అనే మాట ఏదో, అనకూడని మాటఏదో తెలియదు" అంటూ మధుకేసి కొరకొరగాచూసి, "లీలా, నాకు వంటయింట్లో పనుంది రావేపోదాం" అంటూ రెక్కపట్టుకుని లాక్కుపోయింది సీత.

రాత్రి భోజనాలదగ్గర ఇటు మధునీ అటు సీతని ఏదో ఒక వేళాకోళంచేస్తూనేవుంది లీల. సీత కొరగాచూడ్డం, మధు పకపక నవ్వడం ఎంతో సరదాగా గడిచిపోయింది. ఆ రాత్రి తనకీ లీలకి హాల్లో పక్కలువేసి, మధుకి గదిలో పెద్దమంచం మీద దుప్పటి దులిపివేస్తూన్న సీతతో "నువ్వు హాల్లో ఎందుకే, బావగారు నన్ను తిట్టుకోగలరు. గదిలోనే పడుకో" అనబోతున్న లీల నోరు గట్టిగా చేత్తో నొక్కి, "కొంచెం వాగుడు కట్టిపెట్టు నీకు పుణ్యం వుంటుంది. నీ వాగుడు విన్న వాళ్లు నీ బుద్ధి మంచిదికాదనుకొంటారే!" అంది సీత.

"అనుకోనీ, నాకేం భయమా?" అంది లీల.

"కాసేపు కబుర్లు చెప్పుకోవచ్చు హాల్లోకి రండి. మీరిద్దరే మాట్లాడేసుకుంటున్నారు ఏమిటి?" అంటూ మధు పిలిచాడు. ముగ్గురూ హాల్లో కూచుని కబుర్లు చెప్పుకోసాగారు. పరికిణి వెనక్కి దోపికట్టి, తను చింతచెట్టు ఎలా ఎక్కేదో, కాలేజీలో మగపిల్లల్ని చూసి సీత యెలా వణికిపోయేదో, ఓ గొట్టంపేంటు కుర్రాడు తనచేత దవడ ఎలా వాయగొట్టించుకున్నాడో, ఇవన్నీ అప్పటికప్పుడు జరిగినట్లు లీల చెపుతూవుంటే, ఎంతో ఆసక్తిగా వింటున్నాడు మధు.

ఉండుండి సీత పిరికితనంమీద ఓ చెణుకు విసురుతోంది లీల. మధు పకపకా నవ్వుతూ సీతకేసి చూసి "పాపం, ఇవన్నీ నిజమేనా" అంటున్నాడు "అబ్బబ్బ, యిప్పుడవన్నీ ఎందుకే! నాకు నిద్రవస్తోంది బాబూ, పదైంది పడుకుందామా!" అంది సీత. "నీకు నిద్రవస్తూంటే అలా పెద్దమంచంమీద పడుం వాల్చుకో, మీ ఫ్రెండు మంచి ఇంట్రెస్టింగ్ విషయాలు చెపుతున్నారు" అన్నాడు మధు. "ఏమే, యివన్నీ చెపుతుంటే నీ కేమైనా ఇబ్బందిగా ఉందేమిటే" అంది లీల. "నాకేం, చెపుతే చెప్పు. ఈ లైటు కళ్ళలో పడుతోంది. ఆ గదిలో మంచం ఎదురుగుండా లాక్కుని పండుకుంటాను. మీరు పడుకోబోయేటప్పుడు లేపండి, హాల్లోకి వచ్చి పడు కుంటాను" అంది సీత. తను టీపార్టీలకి రాకపోవడం, అధమం కలిసి పైర్కైనా రాకపోవడం, గడపలూ, పసుపులూ, మడీ, తడీ, పూజలూ, చాదస్తాలూ పోవడం- యివన్నీ తన మీదే చెపుతున్నాడు మధు. లీల నవ్వుతూ వింటూంది. వాళ్ళమాటలు అలా చెవిలో పడుతూనే ఉన్నాయి; ఎప్పుడు నిద్రపట్టేసిందో- సీతకి మెలకువవచ్చి చూసేటప్పటికి తెల్లగా తెల్లవారిపోయింది. హాల్లో తనకని వేసిన పక్కమీద మధు నిద్రపోతూనే ఉన్నాడు. లీల మాత్రం బాత్‌రూమ్ నుంచి స్నానంచేసి వస్తోంది. గుడ్‌మార్నింగ్ చెప్పుతూనే "ఏం నిద్రే బాబూ, రాత్రి దొంగలు పడి దోచుకు పోయినా అంతేనా" అంది లీల నవ్వుతూ.

"నీలాంటిదొంగ ఉన్నచోటికి, ఎవడు వస్తాడే!" అంది సీత.

4)

మరునాడు మధు ఆఫీసుకి శలవుపెట్టి కంట్రాక్టర్‌కి కబురుచేసి కారు తెప్పించాడు. పెందరాళే వంటచేసేసి రెండు కేరియర్లలో సర్దేసింది సీత. కారియర్లూ, వాటర్ బాటిలూ తీసుకొని ముగ్గురూ కార్లో కూచుని కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు - మాచర్ల వచ్చేసింది. చెన్నకేశ్వరుడి గుడిచూసి, నందికొండ పర్వతం మీదవున్న మ్యూజియం చూడ్డానికి వెళ్ళారు. మర్నాడు వ్యూపాయింట్, పైలాన్ చూశారు. ఇలా చిన్నప్పటికబుర్లు చెప్పుకుంటూ మనస్సులో తలబోసుకుని, సీతా లీలా కబుర్లు చెప్పుకుంటూ వుంటే రోజులు ఇట్టే దొర్లిపోయాయి. వాళ్ళ తియ్యని స్నేహాన్ని చూస్తూ, లీల చురుకుదనాన్ని ఉత్సాహాన్నిబట్టి అయినా సీత మారకపోతుందా అని ఆశిస్తూ మధురంగా ఆలోచిస్తూ ఉండడంవల్ల మధుకి కూడా ఆ నాలుగు రోజులూ ఇట్టే గడిచిపోయాయి.

లీల వెళ్ళేరోజు వచ్చింది.

లీలకి చీరా, జాకెట్టుగుడ్డా పళ్లూ తెప్పించి ఇచ్చింది సీత. అవి తీసుకొని బండి ఎక్కుతూ, "ఓ మాటు సీతను తీసుకుని మీరు మా యింటికి రండని" మధుని హెచ్చరించింది లీల, మధుని చూసేనా తన భర్త మారకపోతాడా అనే ఆశతో. లీలని బస్సుస్టాండుదాకా తీసుకువెళ్ళి సాగనంపడంకోసం సీతకూడా బయలుదేరింది బండిలో.

సీతా, లీలా ఒకరి చేతిని ఒకరు పట్టుకుని మౌనంగా కూర్చున్నారు. మళ్ళీ యెన్నాళ్ళకి కలుసుకుంటామో అనే బెంగవల్ల ఇద్దరి కంఠాలూ పూడుకుపోయి వున్నాయి. అలా

కొంతసేపు ఎవరూ మాట్లాడకుండా ఉండిపోయాక లీల ఉన్నట్టుండి అంది, "సీతా, నువ్వు చాలా అదృష్టవంతురాలివి. మీ ఆయనెంతో సరదాఅయిన వాడూ మంచివాడూను" అని.

సీత లీలకేసి చూసింది. ఆమె రెండుకళ్ళూ నీళ్ళతో నిండి వున్నాయి. అది చూసి, కళవళపడి, "అదేమిటే" అంది వెంటనే లీల, పైటతో కళ్ళువత్తుకుని పెదిమలమీదికి బలవంతంగా నవ్వు తెచ్చుకుని "అబ్బే, నురేంలేదే, ఏదో ఆలోచిస్తూంటేను" అంది. కాని సీతకి ఆమె మాటమీద నమ్మకం కుదరక, అందుకే అంది, "కాదు. నువ్వేదో దాస్తున్నావు. నాకు చెప్పకూడదా? పరాయిదాన్నా?" అంది.

సీత ఆప్యాయతకు చలించిపోయి ఆమెచేతుల్లో ముఖం పెట్టి ఒక్కసారిగా బావురుమంది లీల. సీత ఆమె తలనిమురుతూ "ఏమటది లీలా... నాకుచెప్పు నీ బాధ ఏమిటో" అంటూ బుజ్జగిస్తూ అడిగింది. అంతలోనే తనను తాను సంబాళించుకుని కళ్లూ ముఖం తుడుచుకుని గంభీరంగా ఉండిపోయింది లీల. "నీ వెంతో బాధపడిఉండకపోతే నీకు ఇంతగా కళ్ళనీళ్లు రావు. నీ వనలు మొండి ఘటానివి. ఏం జరిగిందో చెప్పు" అంటూ గుచ్చి గుచ్చి అడిగింది సీత.

లీల బాధగా "నీకు చెప్పకపోతే ఇంకెవరికి చెపుతానే! అసలు నీ దగ్గరకు వచ్చింది, అందుకేకదా! నీ సంసారం చూస్తూవుంటే, నా మనసులోని బాధని మరచిపోయాను."

ఇంతలోకే బస్సుస్టాండు వచ్చింది. బండి దిగుతూ, "ఇప్పుడు నీకువచ్చిన బాధలు ఏమిటే! మీ సంసారం, మీ

ఆయన..." అనబోతున్న సీతతో, "అదే అడక్కు, అతి తెలివిగా ఎన్నుకొని పెళ్ళిచేసుకున్నాను. ఒకర్నిఒకరం అర్థం చేసుకున్నవాళ్ళం-హాయిగా బ్రతకవచ్చు అనుకున్నా కాని ఆయనకి ఇంత సంకుచితమైన భావాలు వుంటాయనుకోలేదు ఆయనతో బజారుకు వస్తానంటే కోపం, నేను శుభ్రమైన బట్టలు వేసుకుంటే విసుగు. ఇల్లాలు ఇల్లు కదలకూడ దంటారు. చురుగ్గానూ సరదాగానూ ఉంటే లక్ష అపార్థాలకి దారితీస్తుందంటారు. ఆయన వన్నీ పాత అలవాట్లు, పురాత నవు ఆలోచనలు. అస్తమానం, సంప్రదాయాలూ మంచి సావాసాలూ వుండాలంటూ ఉపన్యాసాలు ఇస్తూ వుంటారు. రోజూ వినలేక నాకు బోరు" అంది లీల. ఇంతలోకే బస్సు వచ్చింది. ఎయిర్ బేగ్‌తో బస్సు యెక్కి కూచుంది లీల. బస్సు పక్కనే నిలబడి ఏదో ఆలోచిస్తూ వుండిపోయింది సీత.

"నా గొడవ అంతాచెప్పి నీ మనస్సు వికలంచేశాను, అవునా?" అంది లీల. "అబ్బే, అదేంలేదు" అంది సీత.

"ఆ లేకపోవడ మేమిటి, నీ ముఖం చూస్తూనే తెలు స్తోంది నీమనస్సు ఎంత వికలం అయిందీను."

"అదేంకాదు. ఏదో ఆలోచిస్తున్నాను, అంతే.

"నీలాంటిభార్య ఐతే మా ఆయన ఎంత సంతోషించి ఉండేవారో తెలుసా!" అంది. మళ్ళీ ప్రయత్నపూర్వకంగా నవ్వుతూ. సీత ఇంకా ఆలోచిస్తూనే "దేవు డిలా ఎందుకు చేస్తాడో!" అంది. లీల తల వంకించి నవ్వుతూ, "ఓ, అదా! నీ సమస్య గురించికూడా ఆలోచిస్తున్నా వన్నమాట!" అంది

లీల. ఇంతలో బస్సు స్టార్టు అయింది. "పోనీ ఓ పని చేద్దా మేవమిటే" కొంటెగా చూస్తూ అంది లీల.

'ఏమిటీ' అన్నట్లు చూసింది సీత.

"మనం భర్తల్ని మార్చుకుంటే..." గుండదెబ్బ తగిలినట్లు ఉలిక్కిపడిం దొక్కసారి. సీత. మెదడులో రక్తం గడ్డకట్టుకుపోయినట్టే, "ఏమిటినువ్వనేది" అంటూ ఉండగానే, బస్సు కదిలింది. లీల నవ్వుతూ చెయ్యి ఊపింది.

సీత చెయ్యి లేవలేదు. అచేతనంగా గుడ్లు అప్పగించి అలాగే చూస్తూ, తన ప్రాణం కన్న ప్రాణంగా తన గుండెల్లో దాచుకున్నదేదో దోచుకు పోవాలని బస్సులోంచి తొంగి చూస్తున్న లీల ముఖం, తనని కళవళ పరిచింది. బస్సు వెళ్ళిపోయింది.

సీత మనస్సులో మాత్రం లీల అన్న ఆ ఆఖరిమాటలు గింగురుమంటూ మారుమ్రోగ సాగాయి. నీరసంగా ఇంటి వైపు తిరిగింది. కాళ్లు తడబడుతున్నాయి. శరీరం వణుకు తోంది. తనకి తెలియకుండానే నోట్లో గొణుక్కుంది. 'ఎంత మాట అంది! ఉహూ, వీల్లేదు. రేపటినుంచి ఆయనకి ఎలా కావాలో అలాగే మసలుతాను. టీపార్టీలకి, ఆయన స్నేహి తులతో, ఆయన వెనకాల స్కూటర్ మీద......అంతే... ఏవీ కాదనను. ఇంక ఆయన మనస్సు నొప్పించను'

'ఏమిటో మొదటినుంచీ పాపం అదొక తరహా మనిషి సీత' అనిబస్సులో వెడుతూన్న లీల అనుకుని, జాలిగా నిట్టూర్చింది అన్న సంగతి సీతకేం తెలుసు?